**26-08-2024** ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - పెద్ద బాబా పెద్ద వ్యక్తులైన మీకు ఎక్కువ శ్రమను ఇవ్వరు, కేవలం రెండు పదాలను గుర్తుంచుకోండి - అల్ఫ్ మరియు బే (తండ్రి మరియు వారసత్వము)"

ప్రశ్న:- ఆత్మిక తండ్రి యొక్క ముఖ్య కర్తవ్యము ఏమిటి, అందులోనే తండ్రికి ఆనందం కలుగుతుంది?

జవాబు:- ఆత్మిక తండ్రి యొక్క ముఖ్య కర్తవ్యము, పతితులను పావనంగా చేయడము. తండ్రికి పావనంగా చేయడంలోనే ఎంతో ఆనందము కలుగుతుంది. తండ్రి పిల్లలకు సద్గతినిచ్చేందుకు, అందరినీ సతోప్రధానముగా తయారుచేసేందుకే వస్తారు ఎందుకంటే ఇప్పుడిక ఇంటికి వెళ్ళాలి. కేవలం ఒక్క పాఠాన్ని పక్కా చేసుకోండి - మేము దేహము కాదు, మేము ఒక ఆత్మ. ఈ పాఠము ద్వారానే తండ్రి స్మృతి ఉంటుంది మరియు పావనంగా అవుతారు.

ఓం శాంతి. ఆత్మిక తండ్రి కూర్చొని ఆత్మిక పిల్లలకు అర్థం చేయిస్తారు. తండ్రికి కూడా పిల్లలైన మిమ్మల్ని పవిత్రముగా తయారుచేయడంలో ఎంతో ఆనందము కలుగుతుంది, అందుకే పతిత-పావనుడైన తండ్రిని స్మృతి చేయండి అని అంటారు. సర్వుల సద్గతిదాత ఆ ఒక్క తండ్రే, ఇంకెవ్వరూ కాదు. ఇప్పుడు తప్పకుండా ఇంటికి వెళ్ళాలి అన్నది కూడా మీరు ఇప్పుడు అర్థం చేసుకుంటారు. పురుషార్థము ఎక్కువగా చేయడానికి తండ్రి చెప్తున్నారు - స్మృతియాత్ర తప్పనిసరి. స్మృతి ద్వారానే పావనముగా అవుతారు, ఆ తర్వాత చదువు. మొదట భగవంతుడైన తండ్రిని స్మృతి చేయండి, ఆ తర్వాత ఈ రాజ్యాధికారము, దీని కొరకే మీకు డైరెక్షన్లు ఇస్తారు. 84 జన్మలను ఎలా తీసుకుంటారు అనేది మీకు తెలుసు. సతోప్రధానుల నుండి తమోప్రధానులుగా అవుతారు, మెట్లను కిందకు దిగవలసి ఉంటుంది. ఇప్పుడు మళ్ళీ సతోప్రధానముగా అవ్వాలి. సత్యయుగము పావన ప్రపంచము, అక్కడ ఒక్కరు కూడా పతితులు ఉండరు. సత్యయుగములో ఈ విషయాలేవీ ఉండవు. ముఖ్యమైన విషయము పావనముగా అవ్వడము. ఇప్పుడిక పవిత్రముగా అవ్వండి, అప్పుడే కొత్త ప్రపంచములోకి వస్తారు మరియు రాజ్యం చేయడానికి యోగ్యులుగా అవుతారు. అందరూ పావనముగా అవ్వవలసిందే, అక్కడ అసలు పతితులు ఉండనే ఉండరు. ఎవరైతే ఇప్పుడు సతోప్రధానముగా అయ్యేందుకు పురుషార్థము చేస్తారో వారే పావన ప్రపంచానికి యజమానులుగా అవుతారు. ముఖ్యమైన విషయం ఒక్కటే. తండ్రిని స్మృతి చేయడం ద్వారా సతోప్రధానముగా అవ్వాలి. తండ్రి మీకు ఎక్కువ శ్రమను ఇవ్వరు. కేవలం స్వయాన్ని ఆత్మగా భావించండి అని చెప్తారు. పదే-పదే చెప్తారు, మొదట ఈ పాఠమును పక్కా చేసుకోండి - నేను దేహాన్ని కాను, నేను ఒక ఆత్మను, అంతే. పెద్ద వ్యక్తులు ఎక్కువ చదవరు, కావున రెండు మాటల్లోనే వినిపించేస్తారు. పెద్ద వ్యక్తులకు శ్రమను ఇవ్వడం జరగదు. సతోప్రధానుల నుండి తమోప్రధానులుగా అవ్వడానికి ఎన్ని జన్మలు పట్టాయో మీకు తెలుసు. 63 జన్మలు అని అనరు. 84 జన్మలు పట్టాయి. మనం సతోప్రధానులుగా ఉండేవారము, స్వర్గవాసులుగా అనగా సుఖధామానికి యజమానులుగా ఉండేవారము అని అయితే మీకు నిశ్చయం ఉంది కదా. సుఖధామము ఉండేది, దానినే ఆది సనాతన దేవీ-దేవతా ధర్మం అని అంటారు. వాస్తవానికి వారు కూడా మనుష్యులే, కేవలం దైవీ గుణాలు కలవారిగా ఉండేవారు. ఈ సమయములో ఆసురీ గుణాలు కల మనుష్యులు ఉన్నారు. అసురులకు మరియు దేవతలకు మధ్యన యుద్ధము జరిగిందని, అప్పుడు దేవతల రాజ్య స్థాపన జరిగిందని శాస్త్రాలలో వ్రాసేసారు. తండ్రి అర్థం చేయిస్తున్నారు - మీరు మొదట అసురులుగా ఉండేవారు, తండ్రి వచ్చి బ్రాహ్మణులుగా తయారుచేసారు, బ్రాహ్మణుల నుండి దేవతలుగా తయారుచేసే యుక్తిని తెలియజేశారు. అంతేకానీ అసురులు మరియు దేవతల యుద్ధము యొక్క విషయమే లేదు. దేవతల విషయములో అహింసా పరమో ధర్మము అని అంటారు. దేవతలు ఎప్పుడూ యుద్ధము చేయరు. హింస యొక్క విషయము ఉండదు. సత్యయుగములో దైవీ రాజ్యములో యుద్ధము ఎక్కడి నుండి వచ్చింది. సత్యయుగములోని దేవతలు ఇక్కడకు వచ్చి అసురులతో యుద్ధం చేస్తారా లేక అసురులు అక్కడకు దేవతల వద్దకు వెళ్ళి యుద్ధం చేస్తారా? ఇవేవీ జరగవు. ఇది పాత ప్రపంచము, అది కొత్త ప్రపంచము, మరి యుద్ధము ఎలా జరగగలదు. భక్తి మార్గములోనైతే మనుష్యులు ఏది వింటే దానిని సత్యం, సత్యం అని అంటూ ఉంటారు. ఎవరి బుద్ధీ నడవదు, పూర్తిగా రాతిబుద్ధి కలవారిగా ఉన్నారు. కలియుగములో రాతిబుద్ధి కలవారిగా, సత్యయుగములో పారసబుద్ధి కలవారిగా ఉంటారు. ఆ రాజ్యమే పారసనాథునిది. ఇక్కడైతే రాజ్యమేదీ లేదు. ద్వాపరములోని రాజులు కూడా అపవిత్రముగా ఉండేవారు, వారికి రతనుజడితమైన కిరీటము ఉండేది, ప్రకాశ కిరీటము ఉండేది కాదు అనగా పవిత్రత లేదు. సత్యయుగములో అందరూ పవిత్రముగా ఉండేవారు. అలాగని పైన లైట్ ఏదో నిలబడి ఉంటుందని కాదు. అలా కాదు. చిత్రాలలో పవిత్రతకు గుర్తుగా లైట్ ను చూపించారు. ఈ సమయములో

మీరు కూడా పవిత్రముగా అవుతారు. మీ లైట్ ఎక్కడ ఉంది? తండ్రితో యోగాన్ని జోడించి పవిత్రముగా అవుతారని మీకు తెలుసు. అక్కడ వికారాల మాటే ఉండదు. వికారీ రావణ రాజ్యమే అంతమైపోతుంది. ఇక్కడ ఇప్పుడు రావణ రాజ్యం ఉందని నిరూపించేందుకు ఇక్కడ రావణుడిని చూపిస్తారు. రావణుడిని ప్రతి సంవత్సరము కాలుస్తారు, కానీ అతను కాలడు. మీరు అతనిపై విజయాన్ని పొందుతారు, అప్పుడిక ఈ రావణుడు ఉండనే ఉండడు.

మీరు అహింసకులు. మీ విజయం యోగబలం ద్వారా జరుగుతుంది. స్మృతియాత్ర ద్వారా మీ జన్మజన్మాంతరాల వికర్మలన్నీ వినాశనమవ్వనున్నాయి. జన్మజన్మాంతరాలు అనగా ఎప్పటినుండి? వికర్మలు ఎప్పుడు ప్రారంభమవుతాయి? మొట్టమొదటైతే ఆది సనాతన దేవీ-దేవతా ధర్మము వారైన మీరే వచ్చారు. సూర్యవంశీయులు ఉంటారు, ఆ తర్వాత చంద్రవంశీయులలో రెండు కళలు తగ్గిపోతాయి. మళ్ళీ మెల్లమెల్లగా కళలు తగ్గిపోతూ ఉంటాయి. ఇప్పుడు ముఖ్యమైన విషయమేమిటంటే - తండ్రిని స్మృతి చేసి సతోప్రధానముగా అవ్వాలి. ఎవరైతే కల్పపూర్వము సతోప్రధానముగా అయ్యారో, వారే అవుతారు. అలా వస్తూ ఉంటారు. నంబరువారుగా అయితే ఉంటారు. మళ్ళీ డ్రామానుసారంగా ఎప్పుడైతే వస్తారో అప్పుడు కూడా నంబరువారుగా ఇలానే వస్తారు. వచ్చి జన్మ తీసుకుంటారు. డ్రామా ఎంత విచిత్రముగా తయారుచేయబడి ఉంది, దీనిని తెలుసుకునేందుకు కూడా వివేకం కావాలి. ఏ విధముగా మీరు కిందకు దిగారో అలా ఇప్పుడు మళ్ళీ పైకి ఎక్కాలి. నంబరువారుగానే పాస్ అవుతారు, మళ్ళీ నంబరువారుగా కిందకు వస్తారు. మీ లక్ష్యము-ఉద్దేశ్యము సతోప్రధానముగా అవ్వడము. అందరూ అయితే ఫుల్ పాస్ అవ్వరు. 100 మార్కుల నుండి మళ్ళీ తగ్గుతూ ఉంటుంది, అందుకే చాలా పురుషార్థము చేయాలి. ఈ పురుషార్థములోనే ఫెయిల్ అవుతారు. సేవ చేయడమైతే సహజమే. మ్యూజియంలో మీరు ఏ విధముగా అర్థం చేయిస్తారు అన్నదానిపై ప్రతి ఒక్కరి చదువును గురించి తెలిసిపోతుంది. వీరు సరిగ్గా అర్థం చేయిస్తున్నారా? లేదా? అని హెడ్ టీచర్ చూస్తారు, లేకపోతే వారు స్వయమే వెళ్ళి అర్థం చేయిస్తారు, వచ్చి సహాయం చేస్తారు. ఒకరిద్దరు గార్డులను పెట్టడం జరుగుతుంది, వారు - వీరు సరిగ్గా అర్థం చేయిస్తున్నారా? లేక ఎవరైనా ఏదైనా అడిగితే తికమకపడటం లేదు కదా? అన్నది చూస్తారు. సెంటర్ సేవ కన్నా ప్రదర్శనీ సేవ బాగా జరుగుతుంది అని కూడా భావిస్తారు. ప్రదర్శనీ కన్నా మ్యూజియంలో బాగా సేవ జరుగుతుంది. మ్యూజియంలో చాలా బాగా షో చేస్తారు, అప్పుడు ఎవరైతే చూసి వెళ్తారో వారు ఇతరులకు వినిపిస్తూ ఉంటారు. ఇదైతే చివరి వరకూ నడుస్తూ ఉంటుంది.

ఈ గాడ్ ఫాదర్లీ వరల్డ్ యూనివర్శిటీ అన్న పదము బాగుంది. ఇందులో మనుష్యుల పేరే లేదు. దీని ప్రారంభోత్సవాన్ని ఎవరు చేస్తారు? తండ్రి అన్నారు, మీరు ఎవరైనా పెద్ద వ్యక్తులతో ప్రారంభోత్సవాన్ని చేయించినట్లయితే, ఆ పెద్దవారి పేరు విని ఎంతోమంది వస్తారు. ఆ ఒక్కరి వెనుక ఎంతోమంది వస్తారు, అందుకే బాబా ఢిల్లీకి వ్రాశారు - పెద్ద, పెద్ద వ్యక్తుల అభిప్రాయాలు ఏవైతే ఉన్నాయో వాటిని ముద్రించండి అని. అది చూసి - వీరి వద్దకు ఇంతమంది పెద్ద-పెద్ద వ్యక్తులు వెళ్తున్నారు, వీరు చాలా మంచి అభిప్రాయాలను వ్రాశారు అని మనుష్యులు అంటారు. కావున దీనిని ముద్రించడం మంచిది. ఇందులో ఇంకే ఇంద్రజాలము మొదలైనవాటి విషయం లేదు. అందుకే బాబా వ్రాస్తూ ఉంటారు, అభిప్రాయాల పుస్తకాన్ని తయారుచేయాలి అని. ఇక్కడ కూడా పంచిపెట్టాలి. అసత్యమైన శరీరము, అసత్యమైన మాయ... అన్న గాయనము కూడా ఉంది, అందులో అందరూ వచ్చేస్తారు. ఇది రావణ రాజ్యం, రాక్షస రాజ్యం అని అనేవారు ఎంతోమంది ఉన్నారు. మొదట ఇది ఎవరి రాజ్యమో వారికి ఆ ఆలోచన రావాలి. పతితులైన మమ్మల్ని పావనంగా చేయండి అని అంటారు. కావున పతితత్వములో అన్నీ వచ్చేసాయి. అందరూ ఓ పతిత పావనా అని అంటారు కావున తప్పకుండా పతితులుగా ఉన్నట్లే కదా.

పతిత-పావనుడు పరమపిత పరమాత్మనా లేక అన్ని నదులు, కాలువలా? అన్న చిత్రాన్ని కూడా మీరు యథార్థముగా తయారుచేసారు. అమృతసర్ లో కూడా ఒక సరస్సు ఉంది. నీరు అంతా మురికిగా అయిపోతుంది. దానిని వారు అమృత సరస్సుగా భావిస్తారు. గొప్ప-గొప్ప రాజులు మొదలైనవారు దానిని అమృతంగా భావించి ఆ సరస్సును శుభ్రం చేస్తారు, అందుకే దానికి అమృత్సర్ అన్న పేరును పెట్టారు. వాస్తవానికి అమృతము అని గంగను కూడా అంటారు. ఆ నీరు ఎంత మురికిగా అయిపోతుందో ఇక చెప్పలేము. బాబా ఈ నదులు మొదలైనవాటిలో స్నానం చేసారు. నీరు చాలా మురికిగా ఉంటుంది. మళ్ళీ అందులోంచి మట్టి తీసి పూసుకుంటారు. బాబా అనుభవజ్ఞులు కదా. శరీరము కూడా పాత అనుభవీ శరీరాన్ని తీసుకున్నారు. వీరి వంటి అనుభవజ్ఞులు ఇంకెవరూ ఉండరు. గొప్ప-గొప్ప వైస్రాయ్ లు, రాజులు మొదలైనవారితో కలుసుకున్న అనుభవం కూడా ఉంది. అలాగే ఒకప్పుడు జొన్నలు, సజ్జలు మొదలైనవి కూడా అమ్మేవారు. అప్పుడు చిన్నప్పుడు 4-6 అణాలు సంపాదిస్తేనే సంతోషపడిపోయేవారు. ఇప్పుడు చూడండి, వీరు

ఎక్కడికి చేరుకున్నారు. పల్లెటూరి బాలుడు ఎలా అయ్యారో చూడండి! తండ్రి కూడా అంటారు, నేను సాధారణ తనువులోకి వస్తాను. వీరికి వీరి జన్మల గురించి తెలియదు. ఏ విధముగా 84 జన్మలను తీసుకొని చివరిలో సాధారణ బాలునిగా అయ్యారు అనేది తండ్రి కూర్చొని అర్థం చేయిస్తారు. చరిత్ర శ్రీకృష్ణునిదీ లేదు, అలాగే కంసునిదీ లేదు. కుండలు పగులగొట్టడం మొదలైనదంతా శ్రీకృష్ణుని చరిత్ర అవ్వదు. తండ్రి ఎంత సింపుల్ గా చెప్తారో చూడండి - మధురాతి మధురమైన పిల్లలూ, లేస్తూ-కూర్చుంటూ మీరు కేవలం నన్నొక్కరినే స్మృతి చేయండి. నేను ఉన్నతోన్నతుడిని, సర్వాత్మల తండ్రిని. మనమందరమూ సోదరులమని, వారు తండ్రి అని మీకు తెలుసు. సోదరులమైన మనమందరమూ ఒక్క తండ్రినే స్మృతి చేస్తాము. వారు ఓ భగవంతుడా, ఓ ఈశ్వరా అని అంటారు కానీ ఏమీ తెలియదు. ఇప్పుడు తండ్రి పరిచయాన్ని ఇచ్చారు. డ్రామా ప్లాన్ అనుసారంగా దీనిని గీతా యుగము అని అంటారు ఎందుకంటే తండ్రి వచ్చి జ్ఞానాన్ని వినిపిస్తారు, దాని ద్వారా ఉన్నతముగా అవుతారు. ఆత్మ కూడా శరీరాన్ని ధారణ చేసి ఆ తర్వాత మాట్లాడుతుంది. తండ్రి కూడా దివ్య అలౌకిక కర్తవ్యాన్ని చేయాలంటే శరీర ఆధారాన్ని తీసుకుంటారు. అర్ధకల్పం మనుష్యులు దుఃఖితులుగా అవుతారు కావున పిలుస్తారు. తండ్రి కల్పములో ఒకేసారి వస్తారు. మీరైతే పదే-పదే పాత్రను అభినయిస్తారు. ఆది సనాతనమైనది దేవీ-దేవతా ధర్మము, ఆ పునాది లేదు. వారివి కేవలం చిత్రాలు మాత్రమే మిగిలి ఉన్నాయి. కావున తండ్రి కూడా అంటారు, మీరు ఇప్పుడు ఈ లక్ష్మీ-నారాయణులుగా అవ్వాలి. లక్ష్యము-ఉద్దేశ్యము ఎదురుగా నిలబడి ఉంది. ఇది ఆది సనాతన దేవీ-దేవతా ధర్మము. అంతేకానీ హిందూ ధర్మం అంటూ ఏ ధర్మము లేదు. హిందు అన్నది హిందుస్థాన్ పేరు. ఏ విధముగా సన్యాసులు బ్రహ్మమును అనగా ఆ నివాస స్థానాన్ని భగవంతుడు అని అనేస్తారో, అలాగే వీరు నివసించే స్థానాన్ని తమ ధర్మముగా చెప్పుకుంటారు. ఆది సనాతనమైనది హిందూ ధర్మమేమీ కాదు. హిందువులైతే దేవతల ముందుకు వెళ్ళి వారికి నమస్కరిస్తారు, మహిమను గానం చేస్తారు, ఎవరైతే దేవతలుగా ఉండేవారో, వారే హిందువులుగా అయిపోయారు. ధర్మభ్రష్టులుగా, కర్మభ్రష్టులుగా అయిపోయారు. మిగిలిన ధర్మాలన్నీ ఉన్నాయి, కేవలం ఈ దేవతా ధర్మమే కనుమరుగైపోయింది. వారే పూజ్యులుగా ఉండేవారు, మళ్ళీ పూజారులుగా అయి దేవతలను పూజిస్తారు. ఎంతగా అర్థం చేయించవలసి ఉంటుంది. శ్రీకృష్ణుని గురించి కూడా ఎంతగా అర్థం చేయిస్తారు, అతను స్వర్గము యొక్క మొదటి యువరాజు. కావున 84 జన్మలు కూడా వారి నుండే ప్రారంభమవుతాయి. తండ్రి అంటారు, అనేక జన్మల అంతిమములో కూడా అంతిమములో నేను ప్రవేశిస్తాను. మరి తప్పకుండా దాని లెక్కను తెలియజేస్తారు కదా. ఈ లక్ష్మీ-నారాయణులే నెంబర్ వన్ లోకి వచ్చారు. కావున ఎవరైతే మొదట ఉన్నారో వారే మళ్ళీ లాస్ట్ లోకి వెళ్తారు. కేవలం ఒక్క శ్రీకృష్ణుడే ఉండేవారని కాదు కదా, మిగిలిన విష్ణు వంశావళి కూడా ఉండేవారు. ఈ విషయాలు మీకు బాగా తెలుసు. వీటిని మళ్ళీ మర్చిపోకూడదు. ఇప్పుడు మ్యూజియంలైతే తెరుచుకుంటూ ఉంటాయి, ఎన్నో తెరుచుకుంటాయి, ఎంతోమంది వస్తారు. ఏ విధముగా మందిరాలలోకి వెళ్ళి నమస్కరిస్తారో అలాగే మీ వద్ద కూడా లక్ష్మీ-నారాయణుల చిత్రము ఉందని గమనిస్తే భక్తులు వచ్చి వారి ముందు డబ్బులు పెడతారు. మీరు చెప్తారు - ఇక్కడైతే అర్థం చేసుకోవలసిన విషయం ఉంది, డబ్బులు పెట్టవలసిన విషయం లేదు అని. ఇప్పుడు మీరు శివుని మందిరంలోకి వెళ్తే డబ్బులు పెడతారా? మీరు అర్థం చేయించాలి అనే లక్ష్యముతో వెళ్తారు ఎందుకంటే మీకు వీరందరి చరిత్రను గురించి తెలుసు. మందిరాలైతే ఎన్నో ఉన్నాయి. ముఖ్యమైనది శివుని మందిరము. అక్కడ ఇతరుల మూర్తులను ఎందుకు పెడతారు? ఎందుకంటే అన్ని విగ్రహాల ముందు డబ్బులు పెడుతూ వెళ్ళినట్లయితే సంపాదన జరుగుతుంది. మరి దానిని శివుని మందిరము అని అంటారా లేక శివుని పరివారము యొక్క మందిరము అని అంటారా? శివబాబా ఈ పరివారాన్ని స్థాపించారు. సత్యాతి-సత్యమైన పరివారమైతే బ్రాహ్మణులైన మీదే. శివబాబా పరివారమైతే సాలిగ్రామాలు. మళ్ళీ సోదరీ-సోదరులైన మన పరివారముగా అవుతుంది. మొదట సోదరులుగా ఉండేవారము, తర్వాత తండ్రి వచ్చాక సోదరీ-సోదరులుగా అవుతాము. మళ్ళీ మీరు సత్యయుగములోకి వస్తారు. అక్కడ పరివారము ఇంకా పెద్దగా అవుతుంది. అక్కడ కూడా వివాహాలు జరిగితే పరివారాలు ఇంకా వృద్ధి అవుతాయి. ఇల్లు అనగా శాంతిధామములో ఉన్నప్పుడు మనము సోదరులుగా ఉండేవారము, ఒక్క తండ్రి ఉంటారు. మళ్ళీ ఇక్కడ ప్రజాపిత బ్రహ్మ సంతానముగా సోదరీ, సోదరులుగా ఉన్నాము, ఇంకే సంబంధమూ లేదు, మళ్ళీ రావణ రాజ్యములో ఎంతో వృద్ధి జరుగుతూ ఉంటుంది. తండ్రి అన్ని రహస్యాలనూ అర్థం చేయిస్తూ ఉంటారు, అయినా మళ్ళీ అంటారు - మధురాతి మధురమైన పిల్లలూ, తండ్రిని స్మృతి చేసినట్లయితే జన్మజన్మాంతరాల పాపాల భారము తొలగిపోతుంది. చదువు ద్వారా పాపాలు అంతమవ్వవు. తండ్రి స్మృతే ముఖ్యమైనది. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక

పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. ఫుల్ మార్కులతో పాస్ అయ్యేందుకు మీ బుద్ధిని సతోప్రధానముగా, పారసముగా తయారుచేసుకోవాలి. మందబుద్ధి నుండి సూక్ష్మబుద్ధి కలవారిగా అయి డ్రామా యొక్క విచిత్ర రహస్యాన్ని అర్థం చేసుకోవాలి.

2. ఇప్పుడు తండ్రి సమానముగా దివ్యమైన మరియు అలౌకికమైన కర్మలను చేయాలి. డబుల్ అహింసకులుగా అయి యోగబలము ద్వారా తమ వికర్మలను వినాశనం చేసుకోవాలి.

వరదానము:- కర్మ మరియు యోగము యొక్క బ్యాలెన్సు ద్వారా బ్లెస్సింగ్స్ (ఆశీర్వాదాలు) ను అనుభవము చేసే కర్మయోగీ భవ

కర్మయోగి అనగా ప్రతి కర్మ యోగయుక్తంగా ఉండాలి. కర్మయోగీ ఆత్మ సదా కర్మ మరియు యోగమును కలిపి ఉంచుతారు అనగా బ్యాలెన్సును ఉంచేవారిగా ఉంటారు. కర్మ మరియు యోగము యొక్క బ్యాలెన్సును ఉంచటము ద్వారా ప్రతి కర్మలో తండ్రి ద్వారా అయితే ఆశీర్వాదాలు లభించనే లభిస్తాయి, అంతేకాక ఎవరి సంబంధ సంపర్కములోకైతే వస్తారో వారి నుండి కూడా ఆశీర్వాదాలు లభిస్తాయి. ఎవరైనా మంచి పని చేసినప్పుడు, వీరు చాలా మంచివారు అని హృదయపూర్వకంగా వారి పట్ల ఆశీర్వాదాలు వెలువడుతాయి. చాలా మంచివారు అని భావించటమే ఆశీర్వాదాలు.

స్లోగన్:- క్షణములో సంకల్పాలను స్టాప్ చేసే అభ్యాసమే కర్మాతీత అవస్థకు సమీపంగా తీసుకువస్తుంది.